పీఏసీఎస్ చైర్మన్‌గా జయకృష్ణ



జయకృష్ణకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీసీవో ఈశ్వరయ్య

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 3 : మండలంలోని మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్‌గా జయకృష్ణ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంత వరకు చైర్మన్‌గా ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డిపై కాంగ్రెస్ డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాసం శుక్రవారం నెగ్గడంతో ఆయన స్థానంలో కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవడానికి శనివారం సహకార సంఘ సమావేశాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా సహకారశాఖ అధికారి ఈశ్వరయ్య చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. చైర్మన్ ఎన్నిక కోసం మెట్లకుంట డైరెక్టర్ జయకృష్ణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈశ్వరయ్య ప్రకటించారు. జయకృష్ణకు చైర్మన్‌గా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నిక కార్యక్రమానికి వైస్ చైర్మన్ కృష్ణ, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, రతన్ నాయక్, శ్రీనివాస్, సత్యమ్మ, వెంకటమ్మ, వెంకటయ్యగౌడ్, ఖలీల్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను డైరెక్టర్లతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, పార్టీ నాయకులు వెంకట్రాములు గౌడ్, రాంచంద్రారెడ్డి, దేశ్యానాయక్, అంజిల్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

■ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర ■ పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేత

స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కర్రె భరత్‌కుమార్

కులకచర్ల, ఫిబ్రవరి 3 : విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్లాక్-2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ సొంత డబ్బులతో పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, విద్య లేనివారికి సమాజంలో గుర్తింపు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. స్టడీ మెటీరియల్ దాత కర్రె భరత్‌కుమార్ మాట్లాడుతూ.. పేదలకు తన వంతుగా సహాయం అందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంఈవో హబీబ్ అహ్మద్, ఎస్సై శ్రీశైలం, ఎంపీటీసీ ఆనందం, నాయకులు కనకం మొగులయ్య, వెంకటయ్యగౌడ్, వెంకటేశ్, ఎల్లయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, విష్ణు, వెంకట్‌రాములు, వెంకట్, మురళి, రమేశ్, గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వంద శాతం ఈకేవైసీ పూర్తిచేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 3 : తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులందరినీ ఈకేవైసీ చేయించేందుకు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండల్ రావు, రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి నెల వరకు జిల్లాలో వంద శాతం ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఎవరైనా డీలర్లు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే వారి డీలర్‌షిప్‌ను రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో బినామీ డీలర్లు ఉంటే వారిని గుర్తించి పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకుని ఇతరులకు అమ్మితే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తిరిగి రేషన్ బియ్యం కొనేందుకు వచ్చేవారి సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. డీలర్లు సకాలంలో దుకాణాలను తెరిచి లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించాలన్నారు. సమావేశంలో రేషన్ దుకాణాల సంఘం అధ్యక్షుడు జూకారెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

6న టెంకాయల వేలం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 3 : దుద్యాల మండలంలోని పోలేపల్లిలో ఈ నెల 29 నుంచి నిర్వహించే ఎల్లమ్మ దేవత జాతర బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, లడ్డూ ప్రసాదం, పులిహోర అమ్ముకోవడానికి ఈ నెల 6న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 29 నుంచి మార్చి 15 వరకు, మార్చి 16 నుంచి వచ్చే ఏడాది జాతర వరకు టెంకాయలు అమ్ముకోవడానికి, ఏడాది పాటు లడ్డూ, పులిహోర అమ్ముకోవడానికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు వేలంపాటకు గంట ముందు నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై కాశీనాథ్

పెద్దేముల్, ఫిబ్రవరి 3 : ఓ వ్యక్తి ప్రయాణంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు వెతికి ఆ వ్యక్తికి అప్పగించిన ఘటన శనివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని జనగాం గ్రామానికి చెందిన జి.వెంకట్‌రెడ్డి నెల క్రితం తిరుపతికి వెళ్తున్న క్రమంలో రేణిగుంట రైల్వే స్టేషన్‌లో రైలులో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్ ఫోన్‌ను ట్రాక్ చేసి శనివారం బాధితుడు వెంకట్‌రెడ్డికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న, ఇతర వ్యక్తులు దొంగిలించిన సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సులభంగా ట్రేస్ చేయవచ్చని తెలిపారు. వెంకట్‌రెడ్డి మొబైల్ ఫోన్‌ను ట్రాక్ చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎస్సై కాశీనాథ్, రైటర్లు రవీందర్, మాసయ్యలను తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, తాండూరు రూరల్ సీఐ అశోక్ అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఎంఆర్‌సీ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇస్తున్న చంద్రయ్య, కార్మికులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్లతో ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని, అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీ రద్దు తదితర డిమాండ్లతో దేశవ్యాప్త నిరసనలు చేపడుతున్నట్లు చంద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు అంజిలయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్న అవార్డు.. హర్షణీయం

మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, ఫిబ్రవరి 3 : బీజేపీ అగ్రనేత మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి భారత రత్న ఇవ్వడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనాపురం వెంకటయ్యగౌడ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేశ్వర్ అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలో అద్వానీకి భారత రత్న అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అద్వానీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సమాజ సేవలో తమ వంతు పాత్రను నిర్వహించిన ప్రతి ఒక్కరికి అవార్డులు వస్తాయని తెలిపారు. నిబద్ధతతో కృషిచేసిన సేవలకు లాల్ కృష్ణ అద్వానీకి భారత ప్రభుత్వం భారత రత్నతో గౌరవించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు మహిపాల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, సీనియర్ నాయకుడు రామకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సంతోశ్‌గౌడ్, వెంకట్ రాములు, దోమ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, రాంచంద్రయ్య, గోపాల్, లక్ష్మయ్య, బీరయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అయినాపూర్, బాసుపల్లిలో ప్రత్యేక అధికారి బాధ్యతలు

బాసుపల్లిలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన డీటీ నర్సింహులు

దోమ, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని అయినాపూర్, బాసుపల్లి గ్రామ పంచాయతీల్లో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పాత్ర ముఖ్యమన్నారు. తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ కార్మికుల సేవలు మరువలేనివన్నారు. వీరు సమష్టిగా గ్రామస్తులకు సేవలు అందించి సహకరించాలని కోరారు. అనంతరం ఆయా పంచాయతీల్లో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీల సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

సమస్యలను తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి మహేశ్

పెద్దేముల్, ఫిబ్రవరి 3 : గ్రామంలోని అన్ని కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎర్రగడ్డ తండా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రగడ్డ తండాలో పంచాయతీ సిబ్బందితో పాటు గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఈ నెల 15 నుంచి 20 వరకు తుల్జాభవానీ, అంబాభవానీల గిరిజన సాంప్రదాయ వేడుకలు ఉండడంతో అన్ని వార్డుల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, గ్రామస్తులు సురేశ్, శంకర్, వీరేందర్, బలరాం, గోపాల్, పాఠశాల హెచ్ఎం అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

ఉపాధ్యాయ విద్యార్థులతో జీహెచ్ఎం, ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అజయ్, డీఈవోగా అనిల్, ఎంఈవోగా రాహుల్, జీహెచ్ఎంగా వీణతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక రోజు పాఠశాలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయ విద్యార్థులు తమ అనుభవాలు, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం హరిలాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

బైకును ఢీకొన్న డీసీఎం.. యువకుడు మృతి

అమరేందర్‌రెడ్డి (ఫైల్)

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 3 : బైకును డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడిమైలారం గ్రామ సమీపంలో శనివారం జరిగింది. ఎస్సై అబ్దుల్ రవూఫ్ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్కల్‌కు చెందిన అమరేందర్‌రెడ్డి (24) శనివారం కొడంగల్ నుంచి పరిగికి బైకుపై బయలుదేరాడు. రేగడిమైలారం గ్రామానికి సమీపంలో పరిగి నుంచి కొడంగల్ వైపు వస్తున్న డీసీఎం బైకును వేగంగా ఢీకొట్టి పక్కనే పొలంలో దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో అమరేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా డీసీఎంలో ప్రయాణిస్తున్న సంగీత, ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. డీసీఎం వేగానికి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. డీసీఎం డ్రైవరు అజార్ నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని, మృతుడి అన్న నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు.

డీడీఎంఎస్ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3 : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సు కనీస అర్హత ఎనిమిదో తరగతి, కాగా, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని తెలిపారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 83090 37134, 63058 95867లలో సంప్రదించాలని సూచించారు.

లా పీజీ డిప్లామా పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా విభాగంలో పీజీ డిప్లామా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, సైబర్ లాస్, టాక్సేషన్ అండ్ ఇన్సూరెన్స్ లాస్, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్, అప్లైడ్ హ్యూమన్ రైట్స్, మోడర్న్ కార్పొరేట్ లాస్ తదితర పీజీ డిప్లామా కోర్సుల మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.100 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఎంసీఏ రీవాల్యుయేషన్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఉస్మానియా పరిధిలోని ఎంసీఏ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుకు స్వీకరణ గడువును పొడిగించారు. రెండేండ్ల ఎంసీఏ అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, మూడేండ్ల ఎంసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు రూ.200 అపరాధ రుసుముతో నియమిత ఫీజును ఈ నెల 5వ తేదీ వరకు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేడియోలాజికల్ ఫిజిక్స్ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని పరీక్షల విభాగం అధికారులు చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 7వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ.రాములు తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామాభివృద్ధి శాఖామంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ

కులకచర్లలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

కులకచర్ల, ఫిబ్రవరి 3 : అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. సర్పంచుల పాలన ముగిసినందున ప్రత్యేక అధికారులతో పాలన నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వారు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచుల పదవీ కాలం ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు పంచాయతీల్లో ప్రత్యేక అధికారులతో పాలన నిర్వహించాలని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో అధికారులు పూర్తి సమయాన్ని కేటాయించి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీవో నాగవేణి, ఎంఈవో హబీబ్ అహ్మద్, ఏపీఎం శోభ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెడికల్ హెల్త్ కిట్ అందజేత

కులకచర్ల ప్రభుత్వాస్పత్రిలో హెల్త్ కిట్‌ను అందజేస్తున్న సీహెచ్‌వో చంద్రప్రకాశ్

కులకచర్ల, ఫిబ్రవరి 3 : ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం చేసుకున్న మహిళలకు ప్రభుత్వం ద్వారా మెడికల్ హెల్త్ కిట్‌ను అందిస్తున్నామని సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెల్లాపూర్ గ్రామానికి చెందిన మహిళకు డెలివరీ కావడంతో ఆమెకు కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ హెల్త్ కిట్‌లో ప్రసవం అయిన తల్లికి, బిడ్డకు కావాల్సిన వస్తువులు ఉంటాయని తెలిపారు. పేదలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఓయూలో వ్యాస రచన పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ నాయకుడు కోదాటి నాగేందర్ రావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేందర్ రావు మాట్లాడుతూ 'అప్పుడు ఎట్లుండే తెలంగాణ..? ఇప్పుడు ఎట్లుంది తెలంగాణ..?' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓయూ, నిజాం కళాశాల, సికింద్రాబాద్ పీజీ కళాశాల, సైఫాబాద్ పీజీ కళాశాలల విద్యార్థులతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు సైతం పాల్గొనవచ్చని చెప్పారు. పోటీలను ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, నాయకులు జంగయ్య, బాలెంల అవినాశ్, రామకృష్ణ, మిథున్, మధు, శ్రీను నాయక్, పవన్, సాయి, నిఖిల్, వంశీ, అజయ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మహిళలు మృతి

మౌనిక (ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 3 : అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. వికారాబాద్ టౌన్ సీఐ టంగుటూరి శ్రీను, బాధితులు తెలిపిన వివరాలు... సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలానికి చెందిన పొద్దుటూరు లక్ష్మి భర్త రాములు వృత్తి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండో కూతురైన మౌనిక (28)ను 14 ఏండ్ల క్రితం వికారాబాద్ పట్టణం చింతల బొగుడ, నారాయణపూర్ గ్రామస్తుడైన కురువ శ్రీనివాస్‌కు ఇచ్చి పెండ్లి చేశారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని రోజుల నుంచి మౌనికను భర్త శ్రీనివాస్ వేధిస్తున్నాడు. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో 5, 6 సార్లు పంచాయితీ పెట్టి సముదాయించినా శ్రీనివాస్ తీరుమారలేదు. వినకుండా శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో మౌనికను ఆమె భర్త శ్రీనివాస్, మరిది రాజు, అత్త చెన్నమ్మ, ఆడపడుచులు జ్యోతి, లత కలిసి మౌనికను తాడుతో గొంతుకు బిగించి హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో..

ధారూరు : అనుమానస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ధారూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... మండలంలోని ధారూరు స్టేషన్ గ్రామానికి చెందిన గాజుల జయ (27), అదే గ్రామానికి చెందిన వరుసకు మేనబావ అయిన గాజుల బాలకృష్ణతో 8 ఏండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. గాజుల బాలకృష్ణ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు తాగి వచ్చి భార్య జయను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వారిద్దరు గొడవపడ్డారు. శనివారం ఉదయం జయ లేవకపోవడంతో పక్కింటివారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూచేసరికి అలాగే ఉందని, ఆమె మెడపై కమిలిన గాయం ఉందని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ధారూరు సీఐ రామకృష్ణ, ఎస్సై సంతోశ్‌కుమార్ పరిశీలించారు. భర్త బాలకృష్ణ పెట్టే బాధలు భరించలేక ఉరివేసుకున్నదో.. భర్తనే ఉరి వేసి ఉండవచ్చని మృతురాలి సోదరుడు లాల్‌కోట అనంతయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధారూరు పోలీ